క్లుప్తంగా

షరతులు లేకుండా రుణమాఫీ చేయండి

పెద్దేముల్: కాంగ్రెస్ ప్రభుత్వం షరతులు లేకుండా ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని శుక్రవారం పెద్దేముల్ మండల తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ అంజప్ప, రైతులు ఏసప్ప, దేవప్ప, బక్కప్ప, అంజప్ప, కమలాకర్ డిమాండ్ చేశారు. గత మూడేళ్ల నుంచి భారీగా కురుస్తున్న వర్షాలకు పంటలు పాడై, రైతులు అప్పుల పాలవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది చేతికొచ్చిన పెసర, మినుము ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్నాయన్నారు. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రావన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి రుణమాఫీ కానీ రైతులను తక్షణమే ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పోలీసులకు సమాచారమివ్వాలి

యాలాల: విద్యార్థులు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌కు గురైతే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని షీ టీం ఇంచార్జి అధికారి శేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో షీ టీం పోలీసులు, కళాజాత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ ప్రమాదకరమన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని చదువుకోవాలన్నారు. బాల్య వివాహాలు, సైబర్‌క్రైంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, పాఠశాల ఇంచార్జి సిద్రాములు, జీహెచ్‌ఎం మల్లమ్మ, హెడ్ కానిస్టేబుల్ యాదయ్య, కానిస్టేబుళ్లు వెంకట్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు కల్పించాలి

కొడంగల్ రూరల్ : 61ఏండ్లు పైబడిన వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందించాలని శుక్రవారం తహసీల్దార్ విజయ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏ వారసులు మాట్లాడారు. 61ఏండ్లు నిండిన వీఆర్‌ఏలు విధులు నిర్వహించే క్రమంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన 81, 85 జీఓ మేరకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేయాలని కోరారు.

బంట్వారం: గత ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 81, 85 ప్రకారం 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇవ్వాలని వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు అంజిలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన తహశీల్దార్ విజయ్‌కుమార్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



పూడూరు: ఎన్కేపల్లిలో గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందిస్తున్న సతీష్‌రెడ్డి

పూడూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారెంటీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పూడూరు, ఎన్కేపల్లి, మీరాపూర్ తదితర గ్రామాల్లో గృహలక్ష్మి పథకం ద్వారా గ్యాస్ సబ్సిడీ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేందర్, జిల్లా కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, భాస్కర్, నరేందర్, అనంతయ్య, నర్సింలు, సుభాష్, అశోక్, సూరి, ఖలీల్, ప్రకాష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు యాదవ్, చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్పటి అశోక్ కుమార్ పేర్కొన్నారు. చౌడాపూర్ మండల పరిధిలోని మరికల్ గ్రామ పంచాయతీ పరిధిలో గ్యాస్ సబ్సిడీ ప్రొసీడింగ్స్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీ అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నర్సింహ రెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు గోపాల్ నాయక్, మాజీ ఎంపీటీసీ సత్యకుమార్, శివకుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం

బొంరాస్‌పేట: మండల విద్యాధికారి, జెడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎం హరిలాల్‌ను శుక్రవారం బొట్లోనితండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సన్మానించారు. మండల నోడల్ అధికారిగా ఉన్న హరిలాల్‌కు ఉన్నతాధికారులు ఎంఈఓగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విక్రమం సింగ్, వార్డన్ రాజన్న ఎంఈఓకు శాలువా కప్పి, పూలమాలవేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శరణప్ప, సురేశ్‌కుమార్, రాధిక, రేణుక, అనురాధ, సులోచన తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పంట రుణం

- తీసుకున్న అప్పు చెల్లిస్తే మళ్లీ ఇస్తాం
- తట్టెపల్లి పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి
- వాడీవేడిగా తట్టెపల్లి సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

పెద్దేముల్: అర్హులైన ప్రతీ రైతుకు పంట రుణం మంజూరు చేయనున్నట్లు తట్టెపల్లి పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం చైర్మన్ లక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశం వాడీవేడిగా సాగింది. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడారు. రైతులు తీసుకున్న అప్పులు సకాలంలో చెల్లిస్తే, మళ్లీ రుణాలు మంజూరు చేయడానికి సంఘం సిద్ధంగా ఉందన్నారు. రైతులకు దీర్ఘకాలిక రుణాలు రూ.2లక్షలు వరకూ మంజూరు చేస్తారన్నారు. పంట రుణాలతో పాటు చిన్నకారు, వ్యాపారస్థులకు రూ.20వేల నుంచి రూ.50వేల వరకూ రుణాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో రైతులకు రుణమాఫీ చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన రైతులకు రుణమాఫీ చేయడంలేదని తట్టెపల్లి పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంజప్ప ఆవేదన వ్యక్తం చేశారు. పంట రుణాల మంజూరు చేయడంలో బ్యాంకు అధికారులు తమతమ భేదాలు చూస్తున్నారని ఆయన సభ దృష్టికి తెచ్చారు. పెద్దేముల్ మండలం ఇందూరు గ్రామంలో రైతు ఉల్లి ఈశ్వరమ్మ పంట రుణం కోసం బ్యాంకు చుట్టు తిరిగినా మంజూరు చేయలేదన్నారు. సంఘ సభ్యులు అందుబాటులో లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆయన సభదృష్టికి తెచ్చారు. ఈ విషయంలో స్పందించిన చైర్మన్ లక్ష్మారెడ్డి డైరెక్టర్లు అందుబాటులో లేకుంటే ఇతర డైరెక్టర్లతో సంతకం చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు నరేందర్, మల్లెశం, మొగులప్ప, హన్మంతు, రహీం, శంకర్, శ్రీరాం, సీఈఓ రాజమౌళి పాల్గొన్నారు.

గోదాంలు అద్దెకు ఇస్తాం...

తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో రూ.80లక్షల నాబార్డు నిధులతో నిర్మించిన 2గోదాంలను ఫంక్షన్‌హాల్ లేదా రైస్ మిల్లులకు అద్దెకు ఇవ్వనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ అంజప్ప, డైరెక్టర్‌లు మల్లేశం, నరేందర్, హన్మంతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్, అంజిలప్ప, ఏసు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై జాగ్రత్త అవసరం



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో శ్రీనివాస్

దుద్యాల్: సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. కుదురుమల్ల గ్రామంలోని పల్లె దవాఖాన, నర్సరీని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పల్లె దవాఖానలో మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధ, ఆశ కార్యకర్త మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఫ్యాన్స్ సందడి..

దేవర సినిమా విడుదల సందర్భంగా ఫ్యాన్స్ అన్నదానం



అన్నదానం చేస్తున్న ఫ్యాన్స్

పరిగి: దేవర సినిమా శుక్రవారం విడుదల సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ సందడి చేశారు. సినిమా చూసేందుకు వచ్చిన ప్రేక్షకులకు వారు అన్నదానం చేశారు. సినిమా విడుదల మొదటి షో కావడంతో ప్రేక్షకులు సినిమా చూసేందుకు భారీగా వచ్చారు. ఈ సందర్భంగా సినిమా చూసేందుకు వచ్చిన ప్రేక్షకులందరికి అన్నదానం చేయడంతో వారిని పలువురు అభినందిస్తున్నారు.

‘ఏకలవ్య’ ఆధ్వర్యంలో రైతు సేవలు



మాట్లాడుతున్న తుల్జప్ప

పెద్దేముల్: ఏకలవ్య ఫౌండేషన్ ద్వారా అంబురామేశ్వర రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులకు నాణ్యమైన విత్తనాలతో పాటు ఎరువులు అందజేస్తున్నామని సంఘం అధ్యక్షుడు తుల్జప్ప పేర్కొన్నారు. శుక్రవారం రైతు వేదిక భవనంలో అంబురామేశ్వర రైతు ఉత్పత్తి దారుల సంస్థ మహజన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ రైతుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందజేశామన్నారు. ఫౌండేషన్‌ద్వారా అనేక సేవాకార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, బాలకృష్ణ, ఏడీఏ రుద్రమూర్తి, కోటపల్లి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సాయికుమార్, సీఈఓ అశోక్, డైరెక్టర్లు మోహన్‌రెడ్డి, ఏకలవ్య ప్రతినిధులు చంద్రకాంత్‌రెడ్డి, రాములు దితరులు పాల్గొన్నారు.

ముళ్ల కంచెల తొలగింపు

బంట్వారం: ముళ్ల కంచెలు తొలగించండి అనే శీర్షికన ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. శుక్రవారం బంట్వారం రోడ్డు మార్గంలోని ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు, ముళ్ల పొదలను డోజర్లతో తొలగించారు. బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల కంచెలను తొలగించడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..



బంట్వారం రోడ్డు మార్గంలో ముళ్ల కంచెలను తొలగిస్తున్న డోజర్లు

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం



అల్లాపూర్‌లో ఫినాయిల్ చల్లుతున్న ఆరోగ్య సిబ్బంది

ధారూరు: పరిసరాల పరిశుభ్రత లక్ష్యమని నాగసమందర్ పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జంగయ్య పేర్కొన్నారు. అల్లాపూర్‌లో ఆయన వైద్య సిబ్బందితో కలిసి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని ఆయన సూచించారు. ఇళ్లలో ప్లాస్టిక్ డ్రమ్ములు, పాత్రలు, కుండలను, సిమెంట్ తొట్లను, శుభ్రంగా కడుక్కోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు పెరుగుతాయన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీత, ఏఎన్‌ఎం రాధారాణి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కురుమ సోదరులకు అండగా ఉంటా

తాండూరు రూరల్: తాండూరు మండల కురుమ సోదరులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. కురుమ సంఘం నూతన కమిటీ శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో చీమల నర్సిములు, జినుగుర్తి నర్సిములు, కేబుల్ శ్రీను, ఉల్లి నర్సిములు, రాజు, దస్తప్ప, రవి, శ్రీశైలం, సురేష్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

◆ ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

బంట్వారం: ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని బంట్వారం తహశీల్దార్ విజయ్‌కుమార్ హెచ్చరించారు. తొర్మామిడిలోని సర్వే నంబర్ 302 ప్రభుత్వ భూమిలో అక్రమంగా ప్లాటింగ్ చేసి హద్దురాళ్లను పాతారనే సమాచారంతో శుక్రవారం ఆయన అక్కడికి వెళ్లి విచారించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడారు. ఎవ్వరైనా సరే ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహశీల్దార్ వెంట డీటీ మహేశ్ కుమార్, ఆర్‌ఐ రాంగోపాల్, పంచాయతీ కార్యదర్శి స్వప్న ఉన్నారు.

◆ ఎంఈఓగా బాధ్యతల స్వీకరణ

ధారూరు: ధారూరు మండల విద్యాధికారిగా ధారూరు బాలుర ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనను మండల పీఆర్టీయూ, తరిగోపుల, నాగసమందర్, మోమిన్‌కలాన్, నాగారం ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ అసోషియేట్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా మహిళా కార్యదర్శి శివాని పాల్గొన్నారు.

◆ కొనసాగుతున్న ఆలయ నిర్మాణం

కొడంగల్: పట్టణ శివారులో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం జోరుగా సాగుతోంది. తిరుచిరాపల్లి నుంచి రాతి శిలలు తెప్పించారు. విగ్రహ ద్వారాలు, కిటికీలు సిద్ధం చేశారు. పైకప్పు పనులు చివరి దశకు వచ్చాయి. అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు డాక్టర్ రవీంద్రాయాదవ్, ఉమాపతి గౌడ్, కానుకుర్తి నర్సిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కిషన్ ధాగ, జగదీశ్ కుమార్ తదితరులు దగ్గరుండి పనులు పర్యవేక్షిస్తున్నారు. నిర్మాణానికి ఆసక్తి కలిగిన దాతలు సహకరించాలని కోరారు.

◆ సమస్యలు పరిష్కరించాలని వినతి

తాండూరు టౌన్: తాండూరు పట్టణం ధన్‌గర్ గల్లీలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలంటూ విద్యుత్ ఏఈ రాఘవేందర్‌కు స్థానికులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కరెంట్ డబుల్ ఫేజ్ రావడం వల్ల ఇళ్లల్లోని టీవీలు, ఫ్యాన్ల వంటి ఎలక్ట్రిక్ పరికరాలు కాలిపోయాయన్నారు. వెంటనే మదీనా కాంప్లెక్స్‌కు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు గల్లీలోని ఇనుప స్తంభాలను వెంటనే తొలగించాలని భాను ప్రసాద్, అంబదాస్, మహేష్, సురేష్ తదితరులు కోరారు.

◆ విధి నిర్వహణలో బదిలీలు సహజం

కుల్కచర్ల: విధి నిర్వహణలో బదిలీలు సహజమని ఇప్పాయిపల్లి జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండురంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బదిలీలపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాములు, ఆంజనేయులు, నెహ్రూ, నర్సింలు, రమాదేవి, నూతన ఉపాధ్యాయ బృందం కిరణ్ కుమార్, సరిత, రుక్మిణి, శివశంకర్, శ్యాంసుందర్, యాదయ్య, మైమూద్, పాఠశాల ఏఎంసీ చైర్మన్ సుధారాములు, తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు పోటీలు

తాండూరు టౌన్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ తయారీపై పోటీలు శుక్రవారం నిర్వహించారు. దేశ ఆర్థికాభివృద్ధిపై పర్యాటకం, వారసత్వ సంపద ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వికారాబాద్ జిల్లాలో పర్యాటక రంగాన్ని ఎలా పెంపొందించాలనే విషయంపై పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించారు.

◆ బంట్వారం ఎంఈఓగా వెంకటేశ్వర్‌రావు

బంట్వారం: ఇంచార్జి ఎంఈఓగా వెంకటేశ్వర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన చంద్రప్ప ఉత్తర్వులు అందజేశారు. అంతకు ముందు పలువురు ఉపాధ్యాయులు సత్కరించారు.

◆ ఎంఈఓకు సన్మానం

దోమ: నూతనంగా నియమితులైన ఎంఈఓ వెంకట్‌ను శుక్రవారం ఉపాధ్యాయులు, నాయకులు సన్మానించారు. టీయూపీఎస్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధానకార్యదర్శి నరేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

ఏఈ ప్రవీణ్‌కుమార్



ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులపై అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

కొడంగల్ రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఏఈ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. వృత్తి విద్యా కోర్సులో భాగంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఫీల్డ్‌ట్రిప్ సందర్భంగా పట్టణంలోని సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఏఈ ప్రవీణ్‌కుమార్ విద్యార్థులకు విద్యుత్ సరఫరా, ఆన్, ఆఫ్, సబ్‌స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతు, ట్రాన్స్‌ఫార్మర్ భాగాలు తదితర విషయాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం వృత్తి విద్యా కోర్సు ఉపాధ్యాయులు మహేశ్ మాట్లాడారు. విద్యార్థులకు ఫీల్డ్‌ట్రిప్పుతో సబ్జెక్టుపై పూర్తి అవగాహన కలుగుతుందన్నారు. పీడీ అజిత్, ఆంగ్ల ఉపాధ్యాయులు ఎఫ్.నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

అటవీ పరిరక్షణే ధ్యేయం

మాజీ ఎంపీపీ మల్లేశం



దామగుండం క్షేత్రంలో అభివాదం చేస్తున్న నూతన జేఏసీ సభ్యులు

పూడూరు: నేవీరాడార్ కేంద్రం నుంచి దామగుండం అటవీని కాపాడుకునేవిధంగా ప్రతిఒక్కరూ ధ్యేయంగా నడుచుకోవాలని మాజీ ఎంపీపీ మల్లేశం పేర్కొన్నారు. శుక్రవారం దామగుండం క్షేత్రంలో ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిరక్షణ జేఏసీ చైర్మన్‌గా దేవనోనిగూడ వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడిగా విజయ్‌ఆర్యా క్షత్రియ, మాజీ ఎంపీపీ మల్లేశం, సునంద, వియల క్ష్మిపండిత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోఆర్డినేటర్లుగా మంచన్‌పల్లి సత్తయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, రామన్న, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, బుచ్చన్న, గీతామహేందర్, పీర్‌మహ్మద్, జంగయ్య, సుభాష్, కేశవులు, డాక్టర్ వెంకటేశ్వర్లు, రవినాయక్, ఆనంద్, మల్లేశ్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేవీ రాడార్ కేంద్రం నుంచి దామగుండం అటవీని రక్షించుకోవాలని వారు ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు.

స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

ఎంఈఓ వెంకట్



బొంపల్లి పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న ప్రకాశ్ కుమార్, ఎంఈఓ వెంకట్

దోమ: అంకిత స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని మండల విద్యాధికారి వెంకట్ పేర్కొన్నారు. శుక్రవారం బొంపల్లి, లింగన్నపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో అంకిత స్వచ్ఛంద సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్‌తో కలిసి ఆయన బ్యాగులు, మ్యాట్‌లు, చెప్పులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు సహకరించాలన్నారు. కార్పొరేట్‌కు ధీటుగా విద్యాబోధన చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షఫీ, పరిగి ఎమ్మార్పీ శ్రీశైలం, సీనియర్ జర్నలిస్ట్ ఆంజనేయులు, మాజీ ఉపసర్పంచ్ వెంకట్‌రాములు, మాజీ స్కూల్ చైర్మన్ జంగయ్య, గ్రామస్తులు రాములు, శేఖర్, భాస్కర్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



మోమిన్‌పేట: మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి



దుద్యాల్: చీరలు, పండ్లు పంపిణీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మోమిన్‌పేట: పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉండొచ్చని ఎంపీడీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తల్లి పిల్లల ఆరోగ్యానికి ప్రతిరోజు పాలు, ఆకు కూరలు, గుడ్లు తీసుకోవాలన్నారు.

దుద్యాల్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనతను అధిగమించొచ్చని దుద్యాల్ మండల విద్యాధికారి విజయ రామారావ్ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకమాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని సూపర్‌వైజర్లు జయశ్రీ, మంజుల పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చందర్ పాల్గొన్నారు.


దోమ: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో మహేశ్‌బాబు తెలిపారు. శుక్రవారం దిర్సంపల్లి, దిర్సంపల్లితండా అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు పాఠశాలను ఎంపీఓ సోమలింగంతో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. విద్యాబోధన ఎలా జరుగుతుంది? మధ్యాహ్న భోజనం, సక్రమంగా అందుతుందా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు ఎంపీడీఓ పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శులు రాజేశ్, నర్సింహులు, ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ ఆశయ సాధనకు కృషి

నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ అందరికీ ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొని, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా మండల కార్యాలయాల్లో రాజకీయనాయకులు జయంతిలో పాల్గొని నివాళులర్పించారు.



తాండూరు టౌన్: తాండూరు మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, చైర్ పర్సన్ స్వప్న తదితరులు



తాండూరు టౌన్: నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు



పరిగి: పరిగి మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్ తదితరులు



అనంతగిరి: నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తదితరులు



పెద్దేముల్: నివాళులర్పిస్తున్న మైనార్టీ రాష్ట్ర కన్వీనర్ రియాజ్, గ్రంథాలయ సభ్యులు శివానందం, శ్రీకాంత్ తదితరులు